క్లుప్తంగా

వేణుగోపాలుని ఆలయ హుండీల లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్‌: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం హుండీలను లెక్కించారు. 15 నెలల కాలానికి రూ.1.39 లక్షలు వచ్చినట్లు ఈఓ ఆర్‌.రాజేశ్వరరావు తెలిపారు. హుండీలను దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్ర ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూరాడ కార్యదర్శిగా చక్రపాణి



కరప: మండలం కూరాడ గ్రామకార్యదర్శిగా ఎం.చక్రపాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రూరల్‌ కార్యదర్శిగా పనిచేస్తున్న చక్రపాణి బదిలీపై వచ్చి కూరాడలో చేరారు. కూరాడ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న జూనియర్‌ అసిస్టెంట్‌ రవి నుంచి ఆయన చార్జి తీసుకున్నారు.

రఘుపతి సేవలు ఆదర్శనీయం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సత్సంగ్‌ అధ్యక్షుడు మణికంఠ తదితరులు

కాకినాడ కల్చరల్‌: సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు సమాజ సేవలు ఆదర్శనీయమని బ్రహ్మ ధ్యాన సత్సంగ్‌ అధ్యక్షులు అరవ దుర్గ మణికంఠ అన్నారు. స్థానిక బోట్‌క్లబ్‌ వద్ద బ్రహ్మ ధ్యాన సత్సంగ్‌, బ్రహ్మ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో రఘుపతి జయంతిని బుధవారం నిర్వహించారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ నెల 23 నుంచి అక్టోబర్‌ ఒకటో తేదీ వరకు ఈ జయంత్యుత్సవాలు నిర్వహిస్తామని మణికంఠ అన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు రఘుపతి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని, వివేకనంద పార్కులో రఘుపతి జీవిత చరిత్ర ఫొటో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేశారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులు నగదు బహుమతితో ప్రోత్సహిస్తామన్నారు. గౌతమ్‌, లోకేష్‌, మహేష్‌, ఇందిర, బాషా తదితరులు పాల్గొన్నారు.

9న క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్‌ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా అథ్లెటిక్స్‌ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 9న జిల్లాస్థాయి అథ్లెట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. సంఘ అధ్యక్షుడు కె.స్వర్ణన్‌రాజు పర్యవేక్షణలో స్థానిక పిఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు. అండర్‌–14, 16, 18, 20 విభాగాలలో బాలురు, బాలికల అంశాల్లో ఎంపికలు జరుగతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని ఆయన కోరారు.

కెరియర్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ప్రారంభం

బాలాజీచెరువు: ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్‌ ఇంటరాక్షన్‌ డైరెక్టరేట్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెరియర్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ను బుధవారం సాయంత్రం విద్యామండలి చైర్మన్‌ హేమచంద్రారెడ్డి ప్రారంభించారు. వర్సిటీ అంబేద్కర్‌ సెంట్రల్‌ గ్రంథాలయం మూడో అంతస్తులో 300 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన సెంటర్‌ ప్రారంభించి పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా సెంట్రలైజ్‌ ఏసీ ల్యాబ్‌గా ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రసాదరాజు, రెక్టార్‌ కేవీ రమణ, నన్నయ్య వీసీ పద్మరాజు, రిజిస్ట్రార్‌ సుమలత, ఆర్‌అండ్‌డీ డైరక్టర్‌ రవీంద్ర పాల్గొన్నారు.

తిరుమల మెట్ల మార్గానికి కంచె నిర్మించాలి

బోట్‌క్లబ్‌: కేరళ అడవుల్లో సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య ఐదు కొండలు మీదున్న శబరిమల మెట్ల మార్గానికి ఫెన్సింగ్‌ నిర్మించిన విధంగానే శేషాచల అడవుల్లోని తిరుమలకు ఫెన్సింగ్‌ నిర్మించాలని భోగిగణపతిపీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు డిమాండ్‌ చేశారు. స్థానిక భోగిగణపతిపీఠంలో శ్రీవారి భక్తుల నుంచి మంగళవారం కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఫెన్సింగ్‌ నిర్మించాలని రెండు తెలుగు రాష్ట్రాల్లోను కోటి సంతకాలు సేకరించి టీటీడీ అధికారులు అందించనున్నట్లు చెప్పారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ: డ్వాక్రా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రభుత్వపరంగా అవసరమైన తోడ్పాటు అందిస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో స్థానిక సినిమా రోడ్డులోని ఆనందభారతి గ్రౌండ్స్‌ సమీపంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్‌ మార్కెట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్‌ సీహెచ్‌ నాగనరసింహారావు, వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు హాజరయ్యారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసిన పచ్చళ్లు, గృహోపకరణాలు, మగ్గం తయారీ వస్తువులతో పాటు, స్వీట్లు, డ్రైఫిష్‌, వివిధ రకాల ఉత్పత్తులను అక్కడ ఉంచారు. కొనుగోలుదారుల సౌకర్యార్థం వీటిని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన రుణ సదుపాయంతో చక్కని వస్తువులను తయారు చేసి వ్యాపారాలు సాగిస్తున్న డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్‌ సదుపాయాన్ని కల్పించడమే మెప్మా అర్బన్‌ మార్కెట్ల ప్రధాన ఉద్దేశమన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన ఉత్పత్తులను అందించే ఈ తరహా కార్యక్రమాలకు ప్రజలు కూడా తోడ్పడాలన్నారు. వీటిని తరచూ ఇతర ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయాలని, ప్రజలు కూడా వీటిని ఆదరించి డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌ ప్రియంవద, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్‌, మెప్మా సిటీ మిషన్‌ మేనేజర్‌ డేగల వెంకటరాజు, పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆహా క్యాంటీన్‌' ప్రారంభం

కాకినాడ: ప్రజలకు నాణ్యమైన అల్పాహారాన్ని తక్కువ ధరకు అందించడమే లక్ష్యంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో «ఆహా క్యాంటీన్ల»ను ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక సినిమా రోడ్డులోని నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. వంటల తయారీలో అనుభవం కలిగిన డ్వాక్రా సంఘాలను ఎంపిక చేసి నిర్ణీత ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ క్యాంటిన్‌ ఏర్పాటుకు రూ.13వేలు ఖర్చు అవుతుందని, ఈ సొమ్మును



డ్వాక్రా ఉత్పత్తులతో మహిళలు

టౌన్‌ లెవెల్‌ ఫెడరేషన్‌ ద్వారా సమకూరుస్తారన్నారు. మెప్మా పీడీ ప్రియంవద, టీపీఆర్వో మానే కృష్ణమోహన్‌, సిటీ మిషన్‌ మేనేజర్‌ వెంకటరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు వీరి వెంట ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



నవరత్న పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కన్నబాబు
- కొవ్వూరులో గడప గడపకూ..

కాకినాడ సిటీ: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్‌ నెరవేర్చి వైఎస్సార్‌ సీపీ చేతల ప్రభుత్వమని నిరూపించారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. బుధవారం రాత్రి కాకినాడ రూరల్‌ మండలం కొవ్వూరు పంచాయతీ సచివాలయం–1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి పక్షాల నేతలు కల్లిబొల్లి మాటలు చెప్పి మోసం చేసేందుకు ప్రయత్నిస్తారని, అలాంటి వారి మాటలను నమ్మకుండా మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కన్నబాబు ఇంటింటా ప్రజలను కోరారు. ఎమ్మెల్యే కన్నబాబుకు కొవ్వూరులో సర్పంచ్‌ పిల్లి చక్రరావు, ఉపసర్పంచ్‌ పబ్బినీడి రమేష్‌, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. గ్రామంలో ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలపై ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి అధికారులు ఆదేశాలిచ్చారు. పంచాయతీ కార్యదర్శి జొన్నాడ నరసింహరావు, కార్యకర్తలు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మ్యూజియం అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కౌడా వీసీ సుబ్బారావు తదితరులు

కాకినాడ రూరల్‌: సూర్యారావుపేట బీచ్‌లో గుడా యుద్ధ విమాన మ్యూజియంలో అభివృద్ధి పనులను కౌడా వీసీ సుబ్బారావు సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. యుద్ధ విమానం వద్ద సందర్శకులు లోపలికి వెళ్లి వచ్చేలా చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు పార్కు అభివృద్ధి పనులు పరిశీలించారు. ఇంజినీరింగ్‌ అధికారులను పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. యుద్ధ విమానం మ్యూజియం వద్ద ఏపీ టూరిజం డిపార్టుమెంట్‌ ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్లోరింగ్‌ పనులు, ఇంటర్‌ప్రిటేషన్‌ సెంటర్‌ పనులు జాప్యంతో ఆ ప్రభావం యుద్ధ విమాన మ్యూజియంపై పడుతుందని గుర్తించి రద్దు చేసి, కౌడా ద్వారా పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలు, పిల్లలకు ఆట పరికరాలు, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు తదితర 13 రకాల పనులను రూ.2.32 కోట్లతో చేపడుతున్నామన్నారు. అక్టోబరు నాటికి యుద్ధ విమాన మ్యూజియం ప్రారంభించేలా పనులు వేగవంతం చేశామన్నారు.

ఎన్నికల్లో విజయమే అంతిమ లక్ష్యం

- కష్టించిన వారికి పార్టీలో తగిన గుర్తింపు
- కన్వీనర్లు, గృహసారథులకు ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించి తిరిగి అధికారాన్ని సాధించడమే లక్ష్యంగా కన్వీనర్లు, గృహసారథులు, ఇప్పటి నుంచి కష్టించి పనిచేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డి కన్వెన్షన్‌లో వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన గృహసారథులు, కన్వీనర్ల సమావేశం జరిగింది. ప్రభుత్వ స్థాయిలో సీఎం జగన్‌ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. సుమారు 30 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించామని, పెండింగ్‌ పనులు త్వరలో పూర్తిచేస్తామని ఎమ్మెల్యే అన్నారు. చేసిన అభివృద్ధిని వివరించి ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలిగే పార్టీ వైఎస్సార్‌ సీపీ మాత్రమేనని ఆయన అన్నారు. మొదటి విడత కన్వీనర్లు, రెండో విడత గృహసారథులకు పార్టీ పరంగా ఉచిత బీమా కల్పిస్తున్నామని చెప్పారు. తిరిగి అధికారంలోకి వచ్చాక పార్టీనే నమ్ముకుని కష్టించి పనిచేసిన వారికి సముచిత ప్రాధాన్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్త జగన్‌ మళ్లీ సీఎం కావాలన్న ఏకైక లక్ష్యంతో ప్రజల మధ్యకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పార్టీ కాకినాడ సిటీ సమన్వయకర్త అద్దంకి ముక్తేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌ అబ్దుల్‌బషీరుద్దీన్‌, స్మార్ట్‌ సిటీ మాజీ చైర్మన్‌ అల్లి రాజబాబు, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, జేసీఎస్‌ కన్వీనర్లు సుంకర విద్యాసాగర్‌, రాగిరెడ్డి సుబ్బారావు, ఇనుకొండ పట్టాభిరామయ్య, బాలా ప్రసాద్‌, కిశోర్‌ హాజరయ్యారు.

అభివృద్ధికి అంతా సహకరించండి

- ఎంపీపీ శ్రీలక్ష్మి
- కరప మండల సర్వసభ్య సమావేశం



చింతా నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి తదితరులు

కరప: మండలంలోని గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్‌ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకంలో 339 మందికి రూ 33.9 లక్షలు మంజూరుచేశామని, వైఎస్సార్‌ కళ్యాణమస్తు పథకంలో 12 మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురికి రూ 2.5 లక్షలు వారి ఖాతాలకు జమచేశామన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావుతో కలసి ఆమె మండల పరిధిలో పనులపై శాఖలవారీగా సమీక్షించారు. తహసీల్దార్‌ పి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు జగనన్న ఇళ్ల నిర్మాణంపైనా, ఎంఏఓ ఏవీ రాజేష్‌ ఖరీఫ్‌ ఆలస్యంపైనా మాట్లాడారు. ఎంఈఓ–2 ప్రత్తి సత్యనారాయణ 6,088 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేసినట్టు తెలిపారు. అలాగే ఆర్‌అండ్‌బీ ఏఈఈ కె.సాయిబాబు, హౌసింగ్‌ ఏఈఈ ఎస్‌.రాంబాబు, వైఎస్‌ఎంపీపీ బొమ్మిడి వీర్రాఘవులు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్‌, ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈఈ ఎ.వర్ధన్‌, విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వర ప్రసాద్‌, ఏపీఓ జీ వెంకటరమణ, డాక్టర్‌ ఎంకే సౌజన్య, మండల పశువైద్యాధికారి ఎం.రవికిరణ్‌ బాబు, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగా వర్సిటీ మేనేజ్‌మెంట్‌ బోర్డు సభ్యుడు చింతా ఈశ్వరరావును ఘనంగా సత్కరించారు.

నేషనల్‌ నంది అవార్డుల ప్రదానం



పురస్కారాలు పొందిన నృత్యనికేతన్‌ విద్యార్థినులు

కాకినాడ కల్చరల్‌: స్థానిక శ్రీబాల త్రిపుర సుందరి నృత్యనికేతన్‌ విద్యార్థినులకు జాతీయ నంది అవార్డులు ప్రదానం చేశారు. శిఖరం ఆర్ట్స్‌ థియేటర్‌ సంస్థ ఆధ్వర్యంలో ఈ పురస్కారాల ప్రదానోత్సవం న్యూఢిల్లీలోని ఆంధ్రభవం ప్రాంగణంలోని అంబేద్కర్‌ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. సంస్థ 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వతంత్ర భారతి నాట్యహారతి పేరుతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన నృత్యనికేతన్‌ విద్యార్థినులు అక్షయ భావన, జహ్నవి, నిహారికరెడ్డి, పవిత్ర, గీత, బిందు, సంగీత, ధరణి, శాశ్వతపుష్ప, మీనాక్షి, జియా, సుప్రజ ఆశ్రిత చక్కని నృత్యప్రదర్శనతో మెప్పించారు. వీరికి శిఖరం ఆర్ట్‌ థియేటర్స్‌ సంస్థ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించింది. నాట్యాచార్య బేతా సత్యనారాయణకు సంస్థ వ్యవస్థాపకుడు గొల్ల కృష్ణ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

టంగుటూరి జీవితం ప్రజాసేవకు అంకితం



టంగుటూరికి నివాళులర్పిస్తున్న జేసీ ఇలక్కియ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



టంగుటూరికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్‌ శ్రీనివాసరావు తదితరులు

కాకినాడ సిటీ: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి జెడ్పీ కార్యాలయం సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. అక్కడి ప్రకాశం పంతులు విగ్రహానికి జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌ ఇలక్కియ, శాసన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్‌ సుంకర శివప్రసన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన త్యాగం ఎప్పటికి నిలిచి ఉంటుందని కొనియాడారు.

కరప: స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించి నివాళులు అర్పించారు. తహసీల్దార్‌ పి.శ్రీనివాసరావు, డీటీ కె.అనిల్‌కుమార్‌, ఆర్‌ఐ పేపకాయల మాచర్రావు, ఎ.శివసాయినాథ్‌ తదితరులు పాల్గొన్నారు. మండల ప్రజాపరిషత్‌ సమావేశ మందిరంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎన్‌జీ రంగా వర్సిటీ సభ్యుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్‌, ఎంపీడీఓ కె.అప్పారావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్‌: సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్‌ వాకర్స్‌ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కో ఆర్డినేటర్‌ అడబాల రత్నప్రసాద్‌, పార్థసారధి, రాఘవరావు తదితరులు టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాకినాడ రూరల్‌: రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. వెంకటరమణ తల్లి ఇటీవల మరణించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న వెంకటరమణ, కుటుంబ సభ్యులను రామేశంపేట నివాసంలో పరామర్శించారు. కన్నబాబుతో పాటు సీనియర్‌ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీను తదితరులు ఉన్నారు.

యువత అన్నింటా రాణించాలి



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

కాకినాడ కల్చరల్‌: యువత అన్ని రంగాల్లో రాణించాలని జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.ఇలక్కియ అన్నారు. స్థానిక సత్కళావాహిని ఆడిటోరియంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకనంద జయంతిని పురస్కరించుకు బుధవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీలను జేసీ ఇలక్కియ ప్రారంభించారు. నృత్యం, జానపద, ఉపన్యాసాలు తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. పోటీలో ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు పంపిస్తామని సెట్రాజ్‌ సీఈఓ కె.రమణి అన్నారు. సెట్రాజ్‌ మేనేజర్‌ కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే నూరుశాతం పూర్తికావాలి

- కమిషనర్‌, ఈఆర్వో నాగనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్‌ నాగనరసింహారావు

కాకినాడ: ఓటర్ల సర్వే ప్రక్రియను గురువారం సాయంత్రానికి నూరు శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్‌, ఈఆర్వో సీహెచ్‌ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఇందుకు సంబంధించి ఏఈ ఆర్వోలు, బీఎల్‌వోలు, ఎన్నికల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ ఫారం–6, 7, 8 ద్వారా వచ్చిన ఓటర్ల తొలగింపు, వివిధ మార్పులు, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి బీఎల్‌వోల ద్వారా సేకరించిన మొత్తం సమాచారాన్ని తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే ఆన్‌లైన్‌ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో ఆన్‌లైన్‌ చేసేలా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్‌ కోన శ్రీనివాస్‌, ఎలక్షన్‌ డిప్యూటీ తహసీల్దార్‌, మురళీకృష్ణ, డీసీపీ హరిదాస్‌, ఏసీపీ నాగశాస్త్రులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజరీ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల సమావేశం

ఓటర్ల ఇంటింట సర్వే ప్రక్రియ ప్రగతిపై ఈఆర్వో సీహెచ్‌ నాగనరసింహారావు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సర్వే సందర్భంగా వచ్చిన ఫారం–6, 7, 8కు సంబంధించి నమూనా జాబితాను త్వరలోనే రాజకీయ పార్టీలకు అందజేస్తామని, అభ్యంతరాలను పరిష్కరించిన తరువాత వచ్చే ఏడాది జనవరిలో ఓటర్ల తుది జాబితా ప్రచురితమవుతుందన్నారు. డిసెంబర్‌ వరకు కొత్త ఓటర్లను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధి రావూరి వెంకటేశ్వరరావు, టీడీపీ ప్రతినిధి తుమ్మల రమేష్‌, బీఎస్పీ నాయకులు అప్పారావుతోపాటు ఇతర పార్టీల నాయకులు కూడా హాజరయ్యారు.

నకిలీ వీఆర్వో పేరుతో ధ్రువపత్రాలు



నకిలీ వీఆర్వో అప్పారావు ఇచ్చిన ధ్రువపత్రం

కరప: ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని వారి నుంచి సొమ్ములు కాజేసి, ధ్రువపత్రాలు ఇచ్చేస్తున్నాడు నకిలీ వీఆర్వో. అరట్లకట్ట వీఆర్వోగా బి.దుర్గాదేవి పనిచేస్తున్నారు. అయితే ఎం.అప్పారావు అనే వ్యక్తి తానే వీఆర్వోనంటూ ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు ఇచ్చేస్తూ సొమ్ములు వసూలు చేస్తున్నాడు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన బొండాడ సుబ్బాయ్యమ్మ తన పట్టా భూమిపై బ్యాంకు రుణం పొందేందుకు మొదట నకిలీ వీఆర్వో అప్పారావు నుంచి ధ్రువీకరణ పత్రం పొందారు. అనంతరం ఆ స్థలం సంబంధిత పత్రాలపై పంచాయతీ కార్యదర్శి వై.రాంజీ సంతకం అవసరం అవడంతో అక్కడకు వెళ్లి ఆయనకు వీఆర్వో ధ్రువపత్రం చూపింది. ఆ పత్రాన్ని పరిశీలించిన కార్యదర్శి అసలైన వీఆర్వో దుర్గాదేవికి దానిని అందజేసి నకిలీ ధ్రువపత్రం వచ్చింది చూసుకోండని అందజేశారు. కాగా ఈ ఉదంతంపై కార్యదర్శి కానీ, వీఆర్వో కానీ పై అధికారులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. అలాగే ఈ విషయమై తనకు ఏ సమాచారమూ లేదని తహసీల్దార్‌ పి.శ్రీనివాసరావు తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆర్టీసీలో గిడుగు రామ్మూర్తి జయంతి

కాకినాడ: కాకినాడ ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం దివంగత గిడుగు రామ్మూర్తి పంతులు జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ మాలిక్‌బాషా, కాకినాడ బస్‌స్టేషన్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురప్పాడు హైస్కూలుకు స్పోర్ట్స్‌ ఎక్సలెన్సీ పురస్కారం



వివిధ క్రీడలలో పాల్గొన్న క్రీడాకారులతో పెద్దాపురప్పాడు హైస్కూలు ఉపాధ్యాయులు (ఫైల్‌)

కరప: ప్రస్తుత విద్యా సంవత్సరానికి పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్కూల్‌ ఆఫ్‌ స్పోర్ట్స్‌ ఎక్సలెన్సీ అవార్డు లభించినట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎస్‌ఎస్‌ శ్రీనివాస్‌ బుధవారం తెలిపారు. ఈ నెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2020–21 నుంచి ఈ పురస్కారాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవార్డును భారతదేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ ఆధ్వర్యంలో ఇస్తున్నట్టు తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి తమ పాఠశాల 167 పాయింట్లతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలచి, అవార్డుకు ఎంపికైందని హెచ్‌ఎం తెలిపారు. పెద్దాపురప్పాడు హైస్కూలుకు చెందిన 31 మంది క్రీడాకారులు సాఫ్ట్‌బాల్‌, బేస్‌బాల్‌ అండర్‌–14, 17 బాల, బాలికలు, హ్యాండ్‌బాల్‌, స్విమింగ్‌, రైఫిల్‌ షూటింగ్‌ పోటీల్లో రాష్ట్రస్థాయిలో స్కూల్‌ గేమ్స్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపారని, అందువల్ల ఈ అవార్డు లభించినట్టు పాఠశాల పీడీ బీవీవీఎస్‌ ప్రసాద్‌ తెలిపారు. గతంలో కూడా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2021–22లో 172 పాయింట్లతో పెద్దాపురప్పాడు హైస్కూలు ప్రథమస్థానం సాధించిందని పీడీ తెలిపారు.